

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేసిన డీఎస్పీ

ప్రజాశక్తి- యాదమరి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ యాదమరి పోలీస్ స్టేషన్ అంతర్ రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో అక్రమ వాహనాలపై నిఘాను కట్టుదిట్టం చేయాలని తెలిపారు. అలాగే మండల పరిధిలో సరిహద్దు గ్రామాలైన కనికాపురం, కొట్టాలి గ్రామాల్లో నిఘా పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్సై ఈశ్వరయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సాయినాథ్


నగర అభివృద్ధికి ప్రణాళికలు


బిటి రోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు పట్టణం 18వ డివిజన్ పరిధిలో పివికేఎన్ అటవీ మార్గంలో ఏర్పాటు చేసిన బిటి రోడ్డును కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో చాలా కాలంగా పూర్తి కాని పివికేఎన్ అటవీ మార్గం రోడ్డును సుమారు రూ.4 కోట్లతో పూర్తి చేయడం జరిగిందని, ఈరోడ్డు నిర్మాణంతో నగరంలో ట్రాఫిక్ సమస్య కొంత మేర తీరుతుందని తెలిపారు. ఇదే విధంగా ట్రాఫిక్ సమస్య తీర్చడానికి కట్టమంచి బైపాస్ రోడ్డు నిర్మాణంకు సంబంధించి చిత్తూరు నగరపాలక సంస్థ నుంచి నిధులు త్వరలో సమకూర్చి మరో 10రోజుల్లో విడతల వారీగా మరమ్మతు పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. చిత్తూరు పట్టణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా నగరంలో మౌలిక వసతులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని, అవసరమైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల ఎర్పాటు చేస్తామన్నారు. పివికేఎన్ అటవీ మార్గంలో గతంలో రోడ్డు మార్గంలో ప్రమాదవశాత్తు మరణించిన చిన్నారి జయని రాష్ పేరును పివికేన్ అడవి మార్గంకు పెట్టడం జరుగుతుందని తెలిపారు. చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుగా ఉండడంతో జాతీయ రహదారులు అనుసంధానం కావడం ద్వారా ప్రమాదాలు అధిక శాతం జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని, సర్వాంగ సుందరంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. పివికేఎన్ మార్గం బిటి రోడ్డు పూర్తి చేయడంతో పాటు కట్టమంచి- సాంబయ్య కండ్రిగ బైపాస్ రోడ్డు మరమ్మతు పనులను మున్సిపల్ కార్పొరేషన్ నిధుల నుంచి జిల్లా కలెక్టర్ అనుమతులతో మూడు విడతల్లో చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గత 30 సంవత్సరాల నుంచి చిత్తూరు పట్టణానికి రోడ్లు, డ్రైనేజీ, వ్యవస్థలు రోడ్డు వెడల్పు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చిత్తూరు పట్టణాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో హై రోడ్డు - కట్టమంచి, ఇరువారం - దర్గా సర్కిల్, ఠాణా చెక్ పోస్ట్ - గాంధీ విగ్రహం వరకు గల రోడ్లు వెడల్పు పనులు చెప్పడం జరుగుతుందని, నగర ప్రజలు జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. నగర మేయర్ అముద, చూడా చైర్మన్ కటారి హేమలత, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

హంద్రీ-నీవా పనులను అడ్డుకున్న రైతులు

- నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని నిరసన


భూములు కోల్పోయిన రైతుల వివరాలు


కాలువ పనులను అడ్డుకున్న బాధిత రైతులు

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని సిరిగిరి పల్లి, ఒంటిపల్లిలో భూము కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించకుండానే గుత్తేదారులు పనులు చేస్తుండటంతో రైతులు హంద్రీ- నీవా కాలువ పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. 13 మంది రైతులకు గాను 4 ఎకరాల 53 సెంట్లు భూమికి ప్రభుత్వ ధర ప్రకారం రూ.28,66,000, చెట్లకు, బోరు బావులతో కలిపి రూ.36లక్షలకు వరకు చెల్లించాల్సి ఉంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము అభివృద్ధికి ఆటకం కాదని హంద్రీ నీవా కాలువ ద్వారా నీరు వస్తే తమకు సంతోషమని అన్నారు. అయితే తాము కోల్పోయిన భూమికి నష్టపరిహారం చెల్లించకుండానే పనులు చేస్తున్నారని, తమకు నష్టపరిహారం చెలించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2016 సంవత్సరంలో హంద్రీ -నీవా కాలువ పనుల నిర్మాణం కోసం సిరిగిరి పల్లి, ఒంటిపల్లికి చెందిన 13 మంది రైతుల భూమును తీసుకోవడం జరిగిందని, గత 9 సంవత్సరాలుగా తమకు నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన రైతులు గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి నష్టపరిహారం కోసం పలుమార్లు వినతులు సమర్పించినా ఫలితం లేదని, తమ గోడు పట్టించుకోకపోవడంతో సహనం కోల్పోయి పనులను అడ్డగించడం జరిగిందని తెలిపారు. ఈ మండల ప్రజలకు హంద్రీ-నీవా కాలవ ద్వారా నీరు అందిస్తే తాము కూడా ఆనందిస్తామని, కానీ ఉన్న భూములు కోల్పోయి నిరాశ్రయులుగా ఉన్న తమకు నష్టపరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న హెచ్ఎన్ఎస్ డీఈ వెంటనే నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కానీ రైతులు మాత్రం తాము తొమ్మిదేళ్లగా ఎదురు చూస్తూనే ఉన్నామని తమకు నష్టపరిహారం అందించిన తర్వాతే పనులు చేయాలని పనులను ఆపేశారు.

20 రోజులుగా అందని తాగునీరు


ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని ఆర్వో ప్లాంట్ నుండి నీరు తెచ్చుకుంటున్న ప్రజలు

దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలకు శుద్ధజలం అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ 20 రోజులుగా మరమ్మతులకు గురై మూతపడి ఉంది. దీంతో ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి శుద్ధ జలం తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. వాటర్ ప్లాంట్‌లోని మిషనరీలు మరమ్మతుకు గురైన వాటిని బాగు చేసి ప్రజలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నారు. శివాలయం వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్ కూడా విద్యుత్ కనెక్షన్ సమస్య వల్ల గత వారం రోజులుగా ప్రజలకు శుద్ధ జలం అందించడం లేదు. మండల కేంద్రంలోని రెండు చోట్ల శుద్ధజలం పట్టుకునే అవకాశం లేకపోవడంతో ప్రజలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని శుద్ధ జలం ప్లాంట్ నుండి శుద్ధ జలం తెచ్చుకుంటున్నారు. పంచాయతీ వారు ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే ఆరో ప్లాంట్లను బాగు చేయించి ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించి శుద్ధ జలాన్ని అందజేయాలని కోరుకుంటున్నారు.


పోలీస్ స్టేషన్ ఆవరణంలో మూతపడి ఉన్న ఆర్ఓ ప్లాంట్

వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితి రద్దు చేయాలి

రాజకీయ వేధింపులు మానుకోవాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- సోమల: సంఘ మిత్రులకు మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయాలని రాజకీయ వేధింపులు మానుకోవాలని సంఘమిత్రల జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించారు. మండల కేంద్రమైన సోమలలోని సమావేశపు మందిరంలో నిర్వహించిన వీవోఏల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడారు. లక్షలాదిమంది మహిళలకు అనేక రకాల సేవలు అందిస్తున్న సంఘమిత్రల సమస్యలను పరిష్కారం చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న సంఘ మిత్రులను మూడు సంవత్సరాల కాలం పరిమితి పేరుతో తొలగించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వం సర్క్యులర్ తీసుకొచ్చినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత మంత్రులు ముఖ్యమంత్రి మనం అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు రద్దు చేయకపోవడం సరైనది కాదన్నారు. పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10లక్షలు ఇవ్వాలని, జెండర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్ నిబంధనలకు విరుద్ధంగా జనరల్ బాడీ సమావేశ తీర్మానం లేకపోయినా రాజకీయ జోక్యంతో తొలగించే పద్ధతి మానుకోవాలని అన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అనేక పోరాటాలు జరుగుతున్నాయని జిల్లాలో సంఘమిత్రలు అన్ని మండలాల్లో ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల సిఐటియు నాయకులు చంద్ర శేఖర్, సంఘమిత్రలు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులతో యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

మండల నూతన కమిటీ ఎన్నిక

సోమల మండలంలోని సంఘమిత్రలు ఏపి వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మమత, కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా అగస్తి, కమిటీ సభ్యులుగా అంజప్ప, పెద్ద కృష్ణయ్య, గీత, నారాయణ, గౌతమిలను ఎన్నుకోవడం జరిగింది.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై అవగాహన


స్కీంపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీలో మరోసారి ఎల్ఆర్ఎస్ స్కీమ్ అందుబాటులోకి వచ్చిందని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తెలిపారు. ఎల్ఆర్ఎస్ స్కీం గురించి మంగళవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ ఇంజనీర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఔట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించనుందని చెప్పారు. అక్రమ లేఔట్ల క్రమబద్ధీకరణపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుందని, ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ఏపీసీఆర్డీఏ ప్రాంతాన్ని మినహాయించారని తెలిపారు. రాష్ట్రంలోని పుర, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వేసిన అనధికార లేఔట్లకు ఈ స్కీమ్‌ను వర్తింపజేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫలితంగా పలు అనుమతులు లేకుండా వేసిన లేఔట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం దక్కనుందనీ వివరించారు. ఏపీ ఎల్ఆర్ఎస్ స్కీమ్ ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, ఇప్పుడు 2025 జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఉంటుందని, ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ కోసం 90రోజులు గడువు ఉంటుందని తెలిపారు. ప్రతి ప్లాట్‌కి తప్పనిసరిగా అప్లికేషన్ చేసుకుని ఉండాలని, ప్లాట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ ఛార్జీలు ఉంటాయని, 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14 శాతం అదనపు ఛార్జీలు విధిస్తారని, పాత ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లకు కూడా అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18వేల ఎకరాల్లో వేసిన లేఔట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోందని, దీనికి సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ స్కీమ్ అమలు ద్వారా అనేక ఏళ్లుగా ఎదురు చూస్తున్న నగర, పట్టణ ప్రజలకు ఆయా పథకాల ద్వారా వివిధ లేఅవుట్‌లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనే అవకాశం కలుగుతుందన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శుభప్రద, టౌన్ ప్లాన్ సూపర్వైజర్, టీబీపీవోలు పాల్గొన్నారు.

విజ్ఞానంతో వైద్యరంగంలో నూతన శకం

అపోలో యూనిర్శిటీ వీసీ



సమావేశంలో మాట్లాడుతున్న అపోలో యూనిర్శిటీ వీసీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఓమిక్స్, బయో ఇన్ఫర్మేటిక్స్, డేటా సైన్స్‌ల సమన్వయంతో ఆధునిక వైద్య పరిశోధనలకు దోహదం చేసే 'కనెక్టోమిక్స్ 2025' జాతీయ సదస్సు మంగళవారం చిత్తూరులోని అపోలో వైద్యవిజ్ఞాన పరిశోధన సంస్థలో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల సదస్సును ది అపోలో యూనిర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ వైద్యరంగ అభివృద్ధిలో జీనోమిక్స్, కనెక్టోమిక్స్ కీలక పాత్ర పోషించనున్నాయని, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, వ్యక్తిగత వైద్యానికి దోహదపడే విధంగా ఈ సాంకేతికతలు వినియోగించాల్సిన అవసరం పెరిగిందని తెలిపారు. రోగ నిరోధక శక్తి పెంపే ఆరోగ్య రక్షణకు కీలకమని, వ్యాధులు ప్రభలక ముందే జీనోమిక్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ వంటి విధానాలను ప్రజారోగ్యంలో భాగం చేయాల్సిన అవసరం ఉందన ఆయన పేర్కొన్నారు. అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ మాట్లాడుతూ డిజిటల్ హెల్త్ ప్రాధాన్యత పెరుగుతోందని, అపోలో ఈ రంగంలో కీలక ముందడుగు వేసిందని తెలిపారు. అపోలో ఇప్పటికే లక్షలాది జీవితాలను ప్రభావితం చేసిందని, ఇకపై ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేయడానికి సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి రోగి తన ఆరోగ్య సమాచారాన్ని సెల్‌ఫోన్లో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, మందులను సైతం ఇంటి వద్దకు డెలివరీ చేస్తున్నామని పేర్కొన్నారు. విద్య, పరిశోధన, హెల్త్‌కేర్ డెలివరీ అపోలో సంస్థ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందే సాయంతో అనేకమంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం చిత్తూరు బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఐదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వివిధ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సల పొంది ఆర్థిక సాయం కోసం పలువురు ఎమ్మెల్యే గారి ద్వారా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్బన్ 2, గుడిపాల 2, చిత్తూరు రూరల్ 1 చొప్పున మొత్తం ఐదుగురు లబ్ధిదారులకు రూ.3.87 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రాజ్, శశికర్ బాబు, మేషక్, శ్యామ్, మంజూష, ప్రతిభ, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

నియోజకవర్గ ప్రజలకు తగిన మౌలికవసతులు, సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే 27వ వార్డు పరిధిలో పర్యటించారు. గంగినేని చెరువు వద్ద డీపనింగ్ చేసి, కొత్త మోటర్ బిగించిన బోరును ప్రారంభించారు. అనంతరం స్థానిక మహిళలతో మాట్లాడి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వార్డు సచివాలయాన్ని పరిశీలించి సచివాలయం ద్వారా అందించే ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని వార్డు కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం కాజూరు చెరువును పరిశీలించారు. కాజూరు చెరువు కట్ట, చెరువు సుందరీకరణ పనులపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. కార్పొరేటర్ ఇందు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

భూ రికార్డులను భద్రపరచాలి: జెసి


తహశీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న జెసి విద్యాధరి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని రైతులకు భూములకు సంబంధించిన ప్రతి రికార్డును భద్రపరచాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. మంగళవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో జెసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ రికార్డులను భద్రపరచాలన్నారు. అలాగే మామిడి రైతులకు రాయితీపై తగిన సమాచారాన్ని సేకరించి ఉంచుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారి వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుండి సమాచారాన్ని సేకరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణి, ఉద్యానవన శాఖాధికారి సాగరిక, వ్యవసాయ అధికారి భారతి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా డ్వాక్రా సంఘాలు రాష్ట్రానికే ఆదర్శం కావాలి : పీడీ



సంఘ సభ్యులతో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లా డ్వాక్రా సంఘాలు రాష్ట్రానికే ఆదర్శం కావాలని చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈజీ మార్ట్‌ల నిర్వహణలో జిల్లా రాష్ట్రానికే ఆదర్శ నిలిచిందని ఇదే తరహాలో అన్ని పథకాలను సంఘసభ్యులు సద్వినియోగం చేసుకొని జిల్లాను రాష్ట్రస్థాయిలో అగ్రగామగా నిలపాలన్నారు. ముఖ్యంగా రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వెదురు, మునగ సాగుకు ప్రత్యేక రాయితీ సదుపాయం ఉందని ఈ అవకాశాన్ని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మునగ పంట ఉత్పత్తుల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా సంఘ సభ్యులు మునగ ఆకు తదితర ఉత్పత్తులను యూనిట్ వద్దకు సకాలంలో తీసుకొస్తే దానికి అనుగుణంగా ధరలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు డ్రోన్ కూడా రాయితీతో అందించడం జరుగుతుందని జిల్లాకు ఎనిమిది యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. చదువుకొని సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న సంఘసభ్యులకు వీటిని సబ్సిడీతో అందించడం జరుగుతుందన్నారు. కిచెన్ గార్డెన్‌లు, కోళ్ల పెంపకం వంటి యూనిట్లకు కూడా రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది చెప్పారు. నెక్ వారి ఆర్థిక సాయంతో పేద మహిళలు రోడ్డు పక్కన చిన్న పాటి హోటల్ నిర్వహణ కోసం ఎగ్ మార్ట్‌లు జిల్లాకు 40 కేటాయించారని ప్రస్తుతానికి 10 యూనిట్లు జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. ఈ యూనిట్లను అత్యంత పేదరికంలో ఉన్నవారికి ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతి పథకంపై మండల సమాఖ్యలో చర్చ జరగాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందన్నారు. డిపిఎంలు రవికుమార్, సునీతా లక్ష్మి, ఏపీఎంలు సుబ్బారెడ్డి, మధు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బిల్లులు చెల్లించండి

కలెక్టర్‌కు నాయకుల వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీలకు మామిడి కాయలను సరఫరా చేసిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎంపికైన మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం జీన్స్ ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8వేలు, ప్రభుత్వ సబ్సిడీ రూ.4వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నీలం రకం మామిడికి సబ్సిడీ అందించేలా చూడాలని కోరారు. సంఘం నాయకులు సురేంద్ర, జనార్ధన్, భారతి, నాయకులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు

రూ.1,90,000లు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి రూ.1,90,000లు జరిమానా విధించడం జరిగింది. సోమవారం చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 19 మంది పట్టుబడ్డారు. వీరిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులు 19 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 1,90,000లు జరిమానా విధించడం జరిగింది.

మూఢ నమ్మకాల పేరుతో దోపిడీ

- స్వాముల వేషంలో అపరిచిత వ్యక్తుల సంచారం
- మోసపోతున్న ప్రజలు
- పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి -సోమల: 'మీ ఇంట్లో దోషం వుంది.. ఇంట్లో వారు అనారోగ్యంతో బాధపడుతున్నారు.. పూజలు చేసి దోషం పోగొడతాం.. మీకు, మీ ఇంటికి తాయెత్తులు కట్టి శాంతి కలిగించి అంతా మంచి జరిగేలా చూస్తాం.. దానికి కొంత ఖర్చవుతుంది మీరు భరిస్తే అంతా మంచే జరుగుతుంది..' అంటూ మూఢ నమ్మకాల పేరుతో కొందరు అపరిచిత వ్యక్తులు మాయమాటలు చెప్పి మండలంలో ప్రజలను దోచుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు స్పందించడం లేదని, దీనిపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యం చేసి అప్రమత్తుల్ని చేయాలని పలువురు కోరుతున్నారు. మండలంలో ఇటీవల కాలంలో అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తూ అమాయక ప్రజలను పూజల పేరుతో మోసం చేస్తూ వారి నుండి డబ్బులు వసూలు చేసి పత్తా లేకుండా పోతున్నారు. 20 రోజుల క్రితం ఇరికిపెంట పంచాయతీ డ్యాం వద్ద ఓ ఇంట్లో వారిని నమ్మించి మాయమాటలు చెప్పి పూజలు చేస్తామని డబ్బులు వసూలు చేసి పరారయ్యారు. ఆ తర్వాత ఇదే పంచాయతీలోని మరోక గ్రామంలో మాయ మాటలు చెప్పి తమ పబ్బం గడుపుకుందామని చూడగా ఆ గ్రామంలో వారి ఆటలు సాగక జనం తిప్పి పంపారు. తాజాగా మంగళవారం సోమల పంచాయతీ గన్నావారిపల్లెలో కారులో డ్రైవర్, స్వాముల వేషంలో ఇద్దరు వచ్చి మూడు ఇళ్లలో మూడు పిడికిల బియ్యం తీసుకుని ఆ తర్వాత మళ్లీ మూడు ఇళ్లకు వెళ్లి మీ ఇంట్లో దోషం ఉందని, రోజూ ఎవరో ఒకరు అనారోగ్యానికి గురవుతున్నారని, అప్పుల పాలవుతున్నారని మాయమాటలు చెప్పారు. రూ.1500 ఇస్తే మీ దోషాలు అన్ని పోగొడతాం..!' అని వారిని నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే గ్రామంలోని కొందరు యువకులు విషయాన్ని గ్రహించి వారిని నిలదీయడంతో తమది తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అని





తాము తిరుపతికు వెళుతూ ఇటుగా వచ్చామని నమ్మబలికేందుకు ప్రయత్నించారు. యువకులకు పూర్తిగా వారిపై అనుమానం కలగడంతో తమను ప్రశ్నిస్తే ఇరుక్కోవాల్సి వస్తుందని భావించి ఒక్కసారిగా కారులో ఎక్కి పరారయ్యారు. ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో అమాయక ప్రజలను దోచుకునే స్వాముల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు దండోరా వేయించడం, రాత్రివేళ రచ్చబండ నిర్వహించి ఇలాంటి దొంగ స్వాముల గురించి, వారు చేసే మోసాల గురించి ప్రజలకు వివరించి ఎవరూ మోసపోకుండా, అలాంటివారు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సంబంధిత పోలీసులు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం వుంది.



ప్రజలు నిలదీయడంతో కారు ఎక్కి పారిపోతున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలి: డీపీవో

ప్రజాశక్తి - వెదురుకుప్పం: పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని డీపీవో సుధాకర్‌రావు పేర్కొన్నారు. మండలంలో ఐవిఆర్ ఎస్ గ్రామ పంచాయతీగా ఎన్నికైన పచ్చికాపల్లం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటికీ చెత్త సేకరణను డీపీవో మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతిరోజు పారిశుధ్యం కార్యక్రమాలు నిర్వహించాలని, ఇంటి పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంతకు ముందు వెదురుకుప్పం ఎంపీడీఓ పురుషోత్తం గొడుగుచింత గ్రామ పంచాయతీలో ఇంటింటి కీ చెత్త సేకరణ, ఎస్ డబ్ల్యుపిసి పనితీరు, ఉపాధి హామీ పనులు తనిఖీ చేసి, గ్రామస్థులతో, ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త సేకరణకి సంబంధించిన ఐవిఆర్ఎస్ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, చేతి పంపుల నిర్వహణ వంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేసు, నరేష్, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి శ్రామికులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.



యోగా పోటీల్లో పాల్గొన్న ఆకాష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థినులు

జిల్లా స్థాయి యోగా పోటీ విజేత గ్రీష్మిత

ప్రజాశక్తి -రొంపిచర్ల : చిత్తూరులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో రొంపిచర్ల ఆకాష్ ఇంగ్లీష్ మీడియం హై స్కూలు నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. అందులో టి గ్రీష్మిత అనే విద్యార్థిని జిల్లా స్థాయి యోగా పోటీలలో ద్వితీయ స్థానాన్ని (ఫార్వర్డ్ బెండ్) కైవసం చేసుకుంది. ఆగస్టులో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు టీ.గ్రీష్మిత ఎంపిక కావడంతో ఆకాష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రుణాలు మంజూరు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పురపాలక పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులకు, విద్యార్థులకు విద్యా రుణాలు మంజూరు చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆదేశించారు. పలమనేరు పురపాలక కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం జెఎల్ఎంబిసి బ్యాంకర్ల సమావేశం ఎ హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకర్లు అర్హులైన రైతులకు, కౌలు రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర ప్రభుత్వ బీమా పథకం జెబివై, సురక్ష బీమా యోజన పథకాలకు అర్హత గల వారిని నమోదు చేయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ పీ4లో బ్యాంకర్లు మార్గదర్శకులుగా కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యా రుణాలు ఇవ్వాలని సూచించారు.

జితేంద్రనాయుడు మృతిపై ఎమ్మెల్యే విచారం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : టిడిపి యువరాజుల నాయుడు సోదరుడు జితేంద్ర నాయుడు మృతిపై ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లి గ్రామంలో జితేంద్ర నాయుడు భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ ఉన్నారు.

ధర్మస్థలి ఘటనపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ధర్మస్థలి సంఘటనపై కర్ణాటక ప్రభుత్వం నిజాయతీగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ చిత్తూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చిత్తూరు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కే విజయ గౌరీ మాట్లాడుతూ కర్ణాటక ధర్మస్థలి లో మహిళలపై మానభంగాలు, హత్యలు జరిగినట్టు మృతదేహాలు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయని ఈ సంఘటనలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకులు ఏ జమీలాబి, వి కోమల, సుగుణ, బుల్లెమ్మ, కస్తూరి, జయలక్ష్మి, సుందరమ్మ, నాగమ్మ, హంస పాల్గొన్నారు.

విద్యతో ఉద్యోగాలు సాధించొచ్చు

విజ్ఞాన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యతో ఉద్యోగాలు సాధించవచ్చని విజ్ఞ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం అన్నారు మంగళవారం విజ్ఞాన డిగ్రీ కళాశాలలో బెంగళూరుకు చెందిన 24/7 ఏ ఐ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. అందులో 77 మంది పాల్గొనగా 23 మంది అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోఏ ఐ సిబ్బంది కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

హాస్టళ్లు పరిశీలన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వైసిపి రాష్ట్ర విద్యార్థి విభాగం ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు పవన్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, ఆర్టిఐ విభాగం అధ్యక్షులు ఢిల్లీ కుమార్, మండల యువజన విభాగం నాయకులు గోపి, కిషన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి- వి కోట : రానున్న వర్షా కాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఎంపీడీవో ఈశ్వరన్న ఆధ్వర్యం లో స్థానిక శ్రీ శక్తి భవనంలో చిత్తూరు జిల్లా మలేరియా అధికారి సమక్షంలో జాతీయ కీటక జనిత వ్యాధులపై వి కోట మండలం లోని వివిధ శాఖల అధికారులతో మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ కీటక జనిత వ్యాధు లపై క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు జాగ్రత్తలు అవసరమన్నారు. రానున్న వర్షా కాలం సందర్భంగా కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా , ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని తెలిపారు. ముందస్తు ప్రణాళిక తయారుచేసి లార్వా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇంటింటి సర్వేపై ప్రత్యేక నిఘా ఉంచి, ఫ్రైడే డ్రైడే కార్యక్ర మాన్ని, వెక్టార్ కంట్రోల్ కార్యక్ర మాలను ప్రజల సహకారంతో సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచిం చారు. ఈనెల పూర్తిగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ని పంచా యతీలు అమలు చేయాలని సూచిం చారు. డెంగీ నివారణ పై, కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన నిర్వహించి ప్రతిరోజూ నివేదికను కార్యాలయానికి అందించాలని సూచించారు. ఈ నెల డెంగీ నివారణ మాసం సందర్భంగా ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఎంపిడివో మాట్లాడుతూ ఎంఎల్‌పిహెచ్ లు తాగునీటి నాణ్యత పరీక్షలు సకాలంలో నిర్వహించి నివేదికను ఎంపిడివో కార్యాలయానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వి కోటలో

వైద్యాధికారిణి మాధవి, ఈఓపీఆర్ డీ షెక్షావలి, మండలంలోని సర్పంచులు, పంచాయతీ సెక్రటరీ లు, ఆరోగ్య సిబ్బంది, వివిధ సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం : కీటక జనిత వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో మోహన మురళి అధికారులను ఆదేశించారు. 'కీటక జనిత వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం' అనే కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎస్ఆర్‌పురం వైద్యాధికారి డాక్టర్ షామామ రెహ్మాన్, ఆరి మాకుల పల్లి వైద్యాధికారి డాక్టర్ బాలాజీ చరణ్ అవగాహన కల్పించారు. డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధుల నియంత్రణకు చర్యలు, ప్రజారోగ్య మెరుగుకు తీసు కోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పురం ఆరిమకుల పల్లి వైద్యాధికారులు షామామ రెహ్మాన్, చరణ్, పర్యవేక్షకు సిబ్బంది తిరుమలయ్య, గంగాదేవి, ఝాన్సీ, శ్రీనివాసులు రెడ్డి, శీను మండలము లోని పంచాయతీ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌పి హెచ్, వివిధ సమన్వయ శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మున్సిపాల్టీ పరిధిలోని చికెన్, మటన్ మాంసపు దుకాణదారులు, పట్టణంలోని ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్లతో పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు, నివారణపై అవగాహన కల్పించారు. పై కార్యక్రమంలో కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, హరీష్, సురేష్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : మండల పరిధిలోని పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం లకు ఎంపీడీవో టి చంద్రమౌళి సూచించారు. మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీ లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని విజలాపురం కేజీబీవీ హాస్టల్లో ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో విద్యార్థునులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంది ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, శైలజ, అమరావతి, వేణమ్మ, నారాయణమ్మ, రాణెమ్మ పాల్గొన్నారు.

మోటారు బాగు చేయించండి

- తాగునీరు అందించండి
- కొత్తపేట గ్రామస్తుల అభ్యర్థన



మరమ్మతులకు నోచుకోని తాగునీటి బోరు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని కొత్తపేట పంచాయతీలో రక్షిత మంచినీటిని సరఫరా చేసే బోరు మోటారు పది రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. బాగు చేయించడానికి పంచాయతీ వారు బోరులో నుండి మోటారు పైపు వెలుపలికి తీసి గట్టున ఉంచారు. రోజులు గడుస్తున్నా మోటారు తీసుకువెళ్లి బాగు చేయించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపేట దిగువ వీధి రామాలయం వీధి తదితర ప్రాంతాలకు ఈ బోరు నుండి తాగునీరు పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తారు. అయితే తీసి బయటపడవేసిన మోటారును తీసుకెళ్లి బాగు చేయించి ప్రజలకు తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - రొంపిచర్ల : పులిచెర్ల మండలం కావేటి గారి పల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్లిన సిబ్బందిని శాలువాలతో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులిచెర్ల మండల టిడిపి నాయకులు లెక్కల ధనుంజయ నాయుడు, చంగల్రాయ్ నాయుడు, అరుణాచలం నాయుడు, గురుమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో కొమ్మల కత్తిరింపు ముఖ్యం

ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు(యాదమరి): మామిడి కోత అనంతరం తోటలలో కొమ్మల కత్తిరింపులు చాలా ముఖ్యమని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. మామిడి కాయల కోత అనంతరం మామిడి సాగులో పాటించాల్సిన మెలకువల గురించి వివరించారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు అవార్డు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు అందించిన సేవలకు గుర్తుగా లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్రారెడ్డి అవార్డులు అందించారు. ఈ అవార్డును కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు, జిల్లా క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మద్ అలీ అందుకున్నారు. వీరు చేసిన సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని, రాబోవు రోజులలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు కృష్ణారెడ్డి, ప్రతాప్ యాదవ్, రామరాజు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి - రొంపిచర్ల : పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్ర రెడ్డి, వారి కుటుంబ సభ్యులపై అంతర్జాలంలో అసభ్యకర పోస్టులు పెట్టి నీచమైన వీడియోలతో ఫేస్ బుక్‌లో ఫేక్ ఐడి సృష్టించి పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కల్లూరు టిడిపి నాయకులు ఎస్ ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ లకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అసభ్య పదజాలంతో పోస్టులు చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నూర్ బాషా, ఖాదరవల్లి, అబ్బాస్, సర్దార్, కరుణాకర్ నాయుడు, రాజేంద్ర, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరంలోని ఆర్‌కె ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ కోర్స్ బోధించడానికి అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి స్వరూప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ గ్రాడ్యుయేట్స్ విద్య ఎంఎస్సీ మైక్రో బయాలజీ 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు జూలై 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకొని ఆగస్టు 1వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

దుర్గంధ భరితం!

- కదలని మురుగునీరు
- పట్టించుకోని అధికారులు
- అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: దుర్గంధ భరితంగా మారిన మురుగునీటిని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని తగువారి పల్లి పంచాయతీ ఆండారెడ్డిపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. దుర్వాసనతో పరిసర గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా చర్యలు చేపట్టి మురుగు నీరు ప్రవహించేందుకు



తగిన ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

ఎంఈఓ కార్యాలయంలో పాము

భయాందోళనతో ఉద్యోగుల పరుగులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండల విద్యా వనరుల కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పాము కార్యాలయంలో ప్రవేశించి కలకలం సృష్టించి భయాందోళనకు గురి చేసింది. పామును గుర్తించిన సిబ్బంది భయంతో కార్యాలయం నుండి బయటకు పరుగులు తీశారు. కార్యాలయంలోని సమావేశపు గదిలోకి వెళ్లింది. ఎంత వెతికినా పాము కనిపించక పోవడంతో చివరికి చేసేదేమీ లేక పాములు పట్టే వ్యక్తిని పిలుచుకుని



పామును పట్టి బయట వదిలేస్తున్న దృశ్యం

వచ్చారు. కార్యాలయం మొత్తం పాము కోసం వెతికించారు. చివరికి కార్యాలయంలోని మరుగుదొడ్డి బేసిన్‌లో దాక్కొని ఉండగా పాములు పట్టే వ్యక్తి గుర్తించి చాకచక్యంగా దాన్ని ఓ సంచిలో పట్టుకుని దూరంగా వదిలి వేయడంతో కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా కార్యాలయం లోకి అప్పుడప్పుడూ పాములు వస్తుంటాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి: సీడీపీవో

ప్రజాశక్తి -కార్వేటినగరం: అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేసి కార్వేటినగరం ప్రాజెక్టును జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శోభరాణి అన్నారు. గతంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సీడీపీవో పద్మసునంద, పర్యవేక్షకులు ఇందిరా, షామినితో పాటు సిబ్బంది రామకృష్ణ, కొత్తగా బాధ్యతలు చేపట్టిన పర్యవేక్షకులు రోజారమణి, సిబ్బంది రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ మురళీ, సిబ్బందిని మంగళవారం శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమకు అక్కా చెల్లెలాంటి వారని, ఎవరూ విరోధులు కారని పై స్థాయి అధికారులు ఒత్తిడి వల్ల మీ పట్ల కొంత కోపంతో మాట్లాడాల్సి వచ్చి ఉండొచ్చని వాటిని అన్యదా భావించ వద్దని తెలిపారు. బదిలీ సీడీపీవో పద్మసునంద మాట్లాడుతూ కార్వేటినగరం ప్రాజెక్టులో ఏకదాటిగా ఆరు



సంవత్సరాలు పని చేశానని, తనకు సహకరించినట్లే సీడీపీవో శోభకు సహకరించి ప్రాజెక్టుకు మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు కలసి బదిలీ అయిన వారిని, నూతనంగా, బాధ్యతలు చేపట్టిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది మమత, సుగుణ, రాణి, వళ్లెమ్మ, తేతావతి, నాగమ్మ, మంజుల పలువురు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

- సమాచారం అందించని అధికారులు
- మహిళా సర్పంచుల స్థానంలో కుటుంబీకులు హాజరు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండల ఎంపిడివో కార్యాలయంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో ఎలాంటి చర్చలు లేకపోవడం గమనార్హం. అధికారులు ముఖ్యంగా శాఖల వారీగా 2024.- 2025 సంవత్సరంలో అభివృద్ధి, సమస్యలు, భవిష్యత్తు కార్యచరణ శాఖల వారీగా అన్ని వివరాలు అందించాల్సి వుంది. అయితే ఏ శాఖాధికారులు ఎలాంటి సమాచారం అందించలేదు. మహిళా సర్పంచులుగా ఉన్న పంచాయతీలలో వారి కుటుంబీకులు హాజరు కావడం గమనార్హం. ఏ శాఖ అధికారులైన సంబంధిత శాఖ సంబంధించిన పూర్తి సమాచారం, బదిలీ అధికారులు వీరికి అన్ని వివరాలు తెలిపిన తర్వాతే వారు రిలీవ్ అవుతారు.. ప్రస్తుతం అన్ని సేవలు ఆన్‌లైనులో నిర్వహిస్తారు.. అధికారులు వచ్చి నెలలైనా సమాచారం తెలుసుకోకపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. పంచాయతీల వారీగా అనేక సమస్యలు తిష్ట వేసుకొని వున్నా అధికారులు ఏమీ తెలియనట్లు ప్రవర్తించడం ఎంతవరకు సమంజసం అని సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గత ప్రభుత్వంలో ఎన్నికైన వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రావడంతో అన్ని తారుమారై అధికారులు తమకేమీ తెలియదని బుకాయించడం సరికాదు అంటున్నారు. విధి లేని పరిస్థితుల్లోని మండల సమావేశం నిర్వహించారని గతంలో అనేకసార్లు సమావేశం ఆగిపోయా యని కేవలం వైసిపి సర్పంచులు ఉండటంతోనే ఉద్దేశపూర్వకంగా అధికారుల ప్రవర్తిస్తున్నారని వారు అంటున్నారు.

ఎంపీపీకి పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని ఎంపీపీ మొగసాల రెడ్డప్పకు మంగళవారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వైసిపి ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎం కృష్ణమూర్తి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూపా, జై కుమార్, మండల ప్రజలు వారి స్వగృహం వద్దకు చేరుకొని ఎంపీపీకి చేతుల మీదగా కేకును కట్ చేసి అక్కడికి వచ్చిన వారందరికీ పంచిపెట్టారు. అనంతరం ఎంపీపీ అధ్యక్షులు మొగసా రెడ్డప్పకు కండువా కప్పి పూలమాల వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వారికి విందు భోజనం నిర్వహించారు.

ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-తవణంపల్లి: ఆధునిక వ్యవసాయంపై పుణ్య సముద్రంలో రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి మాధవి, విస్తీర్ణ అధికారిణి మోక్షేస్వరి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ ఆధునిక వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించారు.

క్రైం న్యూస్

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పలమనేరు: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు కథనం మేరకు..పలమనేరు పట్టణం కొత్తపేట ముత్యాలమ్మ ఆలయం సమీపంలో నివసిస్తున్న హెడ్మాస్టర్ జయరాముడు కుమారుడు రాజు (19) ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం వచ్చింది. అతడిని పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా రాజు ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఇందుకు కారణాలు ఏమున్నాయా? అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

18 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుడుపల్లి: అంతర్ రాష్ట్రానికి చెందిన వాహనాల దొంగలను పట్టుకుని వారి నుండి 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని స్థానిక పోలీసులు మంగళవారం తెలిపారు. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్న మోటార్ సైకిల్ దొంగతనాలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. 29వ తేదీ వారికి అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు పీఈఎస్ మెడికల్ కాలేజ్ వద్ద కుప్పం పలమనేరు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు. వారి నుండి 18 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండుకు తరలించారు. మోటారు సైకిళ్ల రికవరీలో పాల్గొన్న కుప్పం రూరల్, అర్బన్ సిఐలు, గుడిపల్లి, రామకుప్పం, రాళ్ళబుదుగురు ఎస్ఐలను ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

పోలీసుల దాడి..జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -యాదమరి: జూదం ఆడుతున్న పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యాదమరి ఎస్ఐ ఈశ్వర్ మంగళవారం తెలిపారు. యదమరి మండలంలోని వరిగపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ జూదం ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి వద్ద వున్న రూ.6,580 నగదు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలో ఇటీవల చోటుచేసుకున్న దొంగతనం కేసుల్లో నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఎస్ఐ పరశురాముడు కథనం మేరకు..ఇటీవల మండలంలో కొన్ని రోజుల క్రితం ఓ ఇంట్లో, మరొక దుకాణంలో దొంగతనం జరిగిన విషయం విదితమే. దీనిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులకు తన సిబ్బందితో పలువురు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడు మహేష్ మాలిక్ బైరెడ్డిపల్లి బీసీ కాలనీ సంబంధించిన వ్యక్తిని అనుమానాస్పద స్థితిలో వుండగా విచారించారు. రెండు దొంగతనం తానే చేసినట్లు ఒప్పుకొనడంతో ఆ నిందితుడిని అరెస్టుచేశారు. అతడి నుండి అపహరించిన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

పాత కక్షల నేపథ్యంలో తగాదా

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పాత కక్షల నేపథ్యంలో కట్టకిందపల్లె దళితవాడలోని ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. గంగాధర నెల్లూరు మండలం కట్ట కింద పల్లి దళితవాడలో మాధవి ఆమె తల్లి చిన్నమ్మ ,సోదరుడు ఢిల్లీ బాబుపై అసభ్య పదజాలంతో వ్యక్తులు దూషించి బెదిరించారని బాధితులు తెలిపారన్నారు. ఈ కేసులో వీరిపై దాడికి పాల్పడి రజిని చిన్నమ్మను చేతులతో కొట్టడం కాకుండా అదే దళితవాడకి చెందిన దుర్గాప్రసాద్, చిరంజీవి, రాజా, వెంకటేష్ లు మాధవికి మద్దతుగా రావడంతో వీరిని కర్రలతో కొట్టి గాయాలు చేశారని పోలీసులు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

పి4పై అవగాహన

ప్రజాశక్తి -సోమల: పి4 బంగారు కుటుంబాలపై సంఘమిత్రలకు సోమల శ్రీ శక్తి భవన్ సమావేశం మందిరంలో ఎంఇడివో నారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి 4 పై సంఘమిత్రలకు అవగాహన కల్పించారు. పేదరికంలో వున్న వారిని ఏ విధంగా అభివృద్ధిలోకి తీసుకురావలో వివరించారు. ఎవరైనా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారా? అని ఎంపీడీవో అడుగగా 40 మంది సంఘ మిత్రలలో ముగ్గురు మాత్రం తాము దత్తత తీసుకొని వారిని అభివృద్ధిలోకి నడిపిస్తామని తెలిపారు. దీంతో వారిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివ, సీసీలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను విశ్రాంత వీఆర్వో, కార్వేటినగరం బంగారమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు కె ప్రసాద్ మంగళవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రసాద్ స్వగృహంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం అందించామని, ఆగస్టులో అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని, గత వైసిపి పాలనలో అరాచకం అవినీతి తప్ప అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కార్వేటినగరం నుండి కోదండరామపురం వరకు తారు రోడ్డు బాగు చేయాలని కే.ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన త్వరలో రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. టిడిపిలో కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం ప్రసాద్ ఇంటిలో ఎమ్మెల్యేకు విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో టీ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, నాయకులు వాసు దేవ రెడ్డి, నటరాజు, ఈశ్వర్, జగన్నాథం, దాము, సోమశేఖర్ యాదవ్, పొద్దుటూరు రాజా ఎమ్మెల్యే సోదరులు రాజా సోమశేఖర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఎఫ్‌సిఓ-1985 ఎరువుల చట్టం కింద నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టవరమైన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. చట్టపమైన చర్యలు తీసుకుంటామన్నారు.